# సర్పదష్టుడు

సూరత్తు వేణుగోపాలరావు

**మంత్రిగారి** వెంట మూడు రోజులు వారి నియోజక వర్గంలో తిరిగి అమాత్యశేఖరుణ్ణి జయప్రదంగా రైలు ఎక్కించి (అంటే వదుల్చుకొని ) ఇంటికి వచ్చేసరికి మూడు దాటింది. ఒళ్ళు హూనమైపోయింది. నాలుగు మెతుకులు తిని, ఒక చిన్న కునుకు తీసుకుందామనుకుంటుంటే వెంకటస్వామి ప్రత్యక్షమయ్యాడు. మళ్ళీ దాపురించాడని విసుక్కుంటూ—"ఏమిటి సంగతి?" అని అడిగాను.

స్వాతంత్ర్యానంతరం కొత్త రోజుల్లోనే మన మంత్రివర్యుల పర్యటనలు విశ్వరూపం దాల్చాయి. వారు బ్రహ్మాండమైన కార్లలో ఆఘమేఘాలమీద గుంటల్నీ, గతుకుల్నీ లెక్కచెయ్యకుండా శరవేగంతో ప్రయాణం చేస్తూ గ్రామ గ్రామాల్లో ఆబాల గోపాలానికీ రాజకీయ చైతన్యం కలిగిస్తుంటే, ప్రతి నాలుగైదు మైళ్ళకీ ఆయాసంతో రొప్పుతూ కదలలేని డొక్కు కారులో నేనూ, అతుకుల బొంత జీపులో పోలీసు సిబ్బందీ మంత్రిగారి రక్షణకోసం వెళ్ళాం.

'తనవెంటన్ సిరి, లచ్చివెంట నవరోధ వ్రాతమున్' అన్నట్లు మంత్రివెంట సకలాయుధ సంపత్తితో పోలీసు బృందం వెళ్ళవలసిందే. లేకపోతే మంత్రిగారు ప్రజల ప్రేమాభిమానాలు ఎంత చూరగొన్నా, ఏ కుర్రకుంకో ఒక రాయి విసరవచ్చు. ఏ రాజకీయ ప్రతిద్వంద్వో నాలుగు కేకలు వేసి సభలో కలకలం లేవచ్చు. అటువంటి ప్రమాదకర పరిస్థితులు రాకుండా పోలీసులు అప్రమత్తతతో ఉండాలి సుమా అని ప్రభుత్వం అడపా దడపా హెచ్చరిస్తుంది.

సబ్ ఇన్‌స్పెక్టరుగా ట్రెయినింగులో ఉన్నాను కాబట్టి నేను కూడా మంత్రిగారిని నీడలా అంటిపెట్టుకొని ఉన్నాను. కాని, నేడో రేపో జిల్లా సూపరింటెండెంటు అవకతప్పదు. మంత్రిగారితో పాటు నాకూ ఎక్కడ కెళ్ళినా గౌరవ మర్యాదల కేమీ లోటులేదు. సభావేదికమీద యథోచితమైన స్థానం తరవాత మృష్టాన్న భోజనం. అల్లుడితో పాటు గిల్లుడు. అయితే వూకదంపుడు ఉపన్యాసాలు విని జీర్ణించుకునే స్తోమత కూడా ఉండాలి 'మంత్రిపుంగవా! సచివోత్తమా! ఆధునిక చాణక్యా!' అని పెద్ద పెద్ద సమాసాలతో పద్య రత్నాలు చదవడానికి ప్రతి గ్రామం లోనూ ఏ ఆస్థాన కవి ఉండక పోడు. తరవాత మంత్రిగారి దీర్ఘమైన మహోపన్యాసం, అవిరళ కరతాళధ్వనులు, ప్రజానీకం అరచేతిలో వైకుంఠం.

"ఏమిటి సంగతి?" అని అడిగిన దానికి ఏ జవాబు లేకుండా నీళ్ళు నములుతూ నిలబడ్డాడు వెంకటస్వామి. మా పర్యటనలో ఈ మహానుభావుడు కూడా ఉన్నాడు. పప్పులేని పెళ్ళా? ఎస్కార్టు పార్టీతో పాటు ఆ మహాకాయాన్ని జీపులో ఎలా ఇరికించేవాడో నాకు అంతుబట్టలేదు. కాని నాకు ఎక్కడ కోపం వచ్చేదంటే టంచను టైము ప్రకారం ఒక పట్టాన తేలేవాడు కాదు. మంత్రిగారి కారు ముందు వెనుకలు చూడకుండా వెళ్ళిపోయినా, ఏ ముదనష్టపు వాడితోనో కబుర్లు చెప్పుకుంటూ ఆలస్యం చేసేవాడు. గంగాయిపాలెంలో కాబోలు





ఐదుదు నిమిషాలు వృథా చెయ్యడంతో నాకు వళ్ళు మండిపోయింది. వెంకటస్వామిని చెడామడా చీవాట్లు పెట్టి పర్యటన పూర్తయ్యాక తర్వాత వాడి భరతం పట్టాలని నిర్ణయించుకున్నాను.



నాకు కోపం రావడానికి మరో కారణం కూడా ఉంది. బందోబస్తు చేసేటప్పుడు పోలీసులుహుందాగా జబర్‌దస్తీగా ఉండాలి. కాని వెంకటస్వామి అవతారం చూస్తే ప్రజలకు పోలీసుల మీద ఏ మాత్రం గౌరవ మర్యాద లున్నా అవి అక్కడి కక్కడే తుడిచి పెట్టుకు పోతాయి. ఎన్నిసార్లు చెప్పినా ఆ మనిషికి అర్థమైతేగా! ఇక మెత్తగా ఉంటే లాభంలేదని లంకించుకున్నాను.

"చూడు, స్వామీ! నీ టర్నౌట్ చూస్తుంటే నాకు చీమలూ, జెర్రులూ పాకినట్టుంది. నీ యూనిఫారమ్ ఎలా ఉందో గమనించావా?"

"దొరగారూ! చీటికీ మాటికీ నా మీద విసుక్కుంటున్నారు. అంతా నా తల రాత ... రెండేళ్ళయినా గవర్నమెంటు కొత్త యూనిఫారమే ఇవ్వలేదు, సార్! దానికి పైన ఆ దర్జీ గాడు ... "

"మధ్యలో దర్జీ ఎందుకయ్యా?"

"కాంట్రాక్టు పద్ధతిమీద ఒకటో రెండో సైజులు కుట్టి అవన్నీ మా ముఖాన్న పారేస్తాడు. అందరూ ఒకేలా గుంటారా? పొడుగూ—పొట్టీ, లావూ—సన్నం—ఈ విశాల ప్రపంచంలో మానవాకారాలు అనేక విధాలు! వాడికి ఆ మాత్రం ఇంగిత జ్ఞానం ఉండొద్దూ? నేను వెళ్ళి ఈ యూనిఫారమ్ బిగుతుగా ఉంది, కొంచెం సరిచేయమని ప్రాధేయపడితే ఏమన్నాడో వింటే మీరే ఆశ్చర్య పడక మానరు." వెంకటస్వామి ఏదో విధంగా విషయాన్ని మార్చివేయడంలో ప్రబుద్ధుడు.

"ఏమన్నాడు?"

"నాకు ఉన్న సైజుల్లో పెద్దవే ఇచ్చాడట. కాని నా అవయవాల తీరుకి తగినట్లుగా ప్రపంచంలో ఏ దర్జీ కుట్టలేడట."

ఆ దర్జీ ఎవడోగాని, నిజమే చెప్పాడు. చాలా కష్టం మీద నవ్వాపుకొని, "సరేలే! నీ గొడవలు వినడానికి నాకు ఓపిక లేదు. కాస్త విశ్రాంతి తీసుకుందా మనుకుంటున్నాను. మరి నువ్విప్పుడు ఎందుకొచ్చినట్లు?" అన్నాను.

"దొరగారు ఈ మూడు రోజులు ఎండనక వాననక తిరిగి అలసిపోయిన సంగతి నాకు తెలియదటండీ! తమర్ని బాధ పెట్టడం నాకుమాత్రం ఇష్టమా? కాని, మన ప్రారబ్ధం! మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్లు ఒక కొత్త మొ.స.లే. వచ్చిపడింది."

"అదేమిటే, స్వామీ? పోలీసు బలగం దుండగుల్ని పట్టడానికి కాని, గజేంద్ర మోక్షాలు చేయడానికి కాదుగా!"

"దొరగారు పొరబడుతున్నారు. మొసలే అంటే మొదటి సమాచార లేఖ. ఈ మధ్య ఇంగ్లీషు పదాలు మానేసి, తెలుగే ఉపయోగించమని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందుకని ఎఫ్.ఐ.ఆర్. బదులు మొ. స. లే. అంటున్నాం."

వెంకటస్వామి ఉపమానాలు, అర్థోక్తులు వేయడంతో అందెవేసిన చెయ్యి. చివరికి నన్ను మూలిగే నక్కతో పోల్చాడే అని లోలోపల బాధపడ్డా, పైకి గంభీరంగా—"బాగుంది. ఎప్పుడు వచ్చిందేమిటి? ఎఫ్.ఐ.ఆర్. . ." నాలిక్కొరుక్కుని, 'మొ. స. లే.'?"

"నిన్న రాత్రి అందిందండి. కాని తమకు భోజనానికి అంతరాయం కలుగుతుందేమోనని చెప్పలేదు, సార్!"

"ఏమిటి? నిన్న రాత్రి వచ్చిన సమాచారం ఇప్పుడు అందిస్తున్నావా? నాన్సెన్సు! మన కొచ్చేవన్నీ ప్రజల జీవన్మరణ సమస్యలు!" అని గదమాయించాను.

వెంకటస్వామి సర్దుకొని, "క్షమించండి. తమరు మంత్రిగారితో విందులో ఉన్నారు. ఈ సమాచారం ఇస్తే తమాలువ పంక్తిలో నుంచి లేచి పోతారేమో అని భయపడ్డాను. అదీగాక అటువంటి శుభ సమయంలో చావు కబురు. . ."

"చూశావా? హత్య పరిశోధన ముఖ్యమా? మంత్రిగారితో విందు ముఖ్యమా?"

"హత్య కాదండీ. . ."

"మరి చావు కబురంటావేం?"

"ఆకస్మిక మరణం, సార్! గంగాయపాలెంలో పొలాల వీరయ్య అనే వ్యక్తి పాము కాటువల్ల నిన్న మధ్యాహ్నం చనిపోయాడని మునసబు ఒకరిని పంపారు."

"ఇంతేనా! ఈ మాత్రందానికి ఇంత రాద్ధాంతం చేశావా? శవ పంచాయతీకి నువ్వు, లేకపోతే 360 రాఘవయ్యో వెళ్ళవచ్చుగా."

వెంకటస్వామి తొణకలేదు. నెమ్మదిగా "తమరు చెప్పినట్లే వెళ్ళవచ్చండి. కానీ దొరగారే స్వయంగా శవ పంచాయతీ చేస్తే బాగుంటుంది" అని అన్నారు.

నాకు ఉన్న కాస్త ఓపిక కూడా పోయింది. "ఎవడో పాము కరిచి చస్తే నేనెందుకయ్యా? చేసిన నిర్వాకం చాలుగాని, ఇక వెళ్ళు. మరెప్పుడూ ఇలాంటి చిన్న విషయాలకు నన్ను రమ్మనవద్దు..." అని కేకలేశాడు.

వెంకటస్వామి కదలలేదు. "దొరగారు చెప్పింది నిజమేనండి. మేము చేయవలసిన పనులకు తమంత వారిని బాధ పెట్టడం భావ్యం కాదన్న సంగతి నాకు తెలియదా? కానీ తమరు ఐ.పి.ఎస్. ఆఫీసర్, సబ్ ఇన్స్‌పెక్టర్ ట్రెయినింగ్ మూడు మాసాల్లో అప్పుడే రెండు నెలలైపోయాయి. ఈ టైములో ఐదు శవ పంచాయతీలు చేయాలని నియమం ఉంది. మన దురదృష్టం కొద్దీ ఇప్పటిదాకా శవపంచాయతీకి తమకు ఒక్క అవకాశం కూడా దొరకలేదు. నియమం ప్రకారం ఎవ్వరూ చావకపోతే ఐ.జీ. దొరగారు తమరి తప్పు పట్టుకొంటారేమోనని నా భయం. తరువాత తమరి ఇష్టం."

వెంకటస్వామి చెప్పినదాంట్లో నిజం లేకపోలేదు. మా పోలీసు డిపార్టుమెంటులోనే కాదు. ప్రభుత్వ రంగంలో అధికారుల అనుభవం కూడా గణాంక శాస్త్రం మీదనే ఆధారపడి ఉంది. ఎన్ని హత్యలు పరిశోధించాడు, ఎన్ని లాటీచార్జీలు చేశాడు, ఎన్ని బందోబస్తుల్లో ప్రావీణ్యం సంపాదించాడు—ఇవీ అనుభవానికీ, విజ్ఞతకీ గీటురాళ్ళు. ఒకవేళ నిర్ణయించిన కేసుల సంఖ్య తగ్గితే నా ట్రెయినింగ్ పొడిగించే ప్రమాదం కూడా ఉంది. అందులోనూ ప్రస్తుతం నా పనిని పర్యవేక్షిస్తున్న మహాశయుడు అపర దుర్వాసుడు. అవకాశం దొరికితే యువతరం ఐ.పి.ఎస్. అధికారులను ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తేగాని ఆయన మనస్సుకి శాంతి ఉండదని వినికిడి. ప్రస్తుతం వచ్చిన కేసు హత్య కాకపోతేనేం? ఉసూరుమంటూ కారు తీసుకుని వెంకటస్వామితో బయలుదేరాను.

గంగాయపాలెం పది మైళ్ళే కాని, నా కులకో ముప్పై మైళ్ళు ప్రయాణం చేసినట్లయింది. ఉబుసుపోక ముందు సీట్లో స్థాణువులా కూర్చున్న వెంకటస్వామితో—"పాము కాటువల్ల మరణించాడంటున్నావు. ఇది హోమ్సు పరిశోధించిన స్పెకిల్డ్ బాండ్‌లాంటి కేసు కాదు కదా?"

"హోమ్సు దొరగారా? నేను సర్వీసులో చేరినపుడు మద్రాసు రాష్ట్రానికి ఐ.జీ.గా ఉండేవారు. ఆయనంటే హడలంటే నమ్మండి."

"ఆ హోమ్సు కాదయ్యా! షెర్లాక్ హోమ్సు! ఆయన కీర్తి దిగంతాలవరకూ వ్యాపించింది. నేర పరిశోధనలో అమోఘమైన ప్రతిభాసంపన్నుడు. నిన్ను ఒక్కసారి చూశాడనుకో—క్షణంలో నువ్వు మధ్యాహ్నం భోజనంలో ఏమి కూరలు తిన్నావో కూడా చెప్పగల ధీమంతుడు. పోలీసు వ్యవస్థలో పని చేస్తూ ఆయన పేరే వినలేదంటే మనశాఖ ఎంత ఉధ్వాన స్థితిలో ఉందో తెలుస్తోంది."

"మరి దొరగారేదో బాండ్ అన్నారు. ఆ సంగతి సెలవిచ్చారు కాదు."




"అదంతా ఒక పెద్ద కథ. ఇంకెప్పుడైనా చెబుతాను. ప్రస్తుత మన కేసు సంగతి చెప్పు."

వెంకటస్వామి కథనం ప్రకారం గంగాయపాలెంలో వీరయ్య రామానాయుడు అనే పెద్ద రైతు దగ్గర పాలేరు. ఆ గ్రామంలో రామానాయుడు మంచి పరపతిగల మనిషి. వీరయ్య భార్య నాగలక్ష్మి కూడా వాళ్ళ ఇంట్లోనే పని చేస్తుంటుంది.

వీరయ్య పొద్దున్నే లేచి చద్దన్నం తిని పనికి వెళ్ళేవాడు. మధ్యాహ్నం భోజనం భార్య పొలానికే తెచ్చేది. అక్కడే ఇద్దరూ భోంచేసి కాస్సేపు కబుర్లు చెప్పుకున్న తర్వాత నాగలక్ష్మి పోయేది. ప్రొద్దుకుంకే వరకు పని చేసి ఇంటికి చేరుకునేవాడు వీరయ్య. ఇది వాడి దిన చర్య.

క్రిందటి దినం మంత్రిగారు గంగాయపాలెం వెళ్ళినప్పుడు ఆ సభకు వీరయ్య కూడా వచ్చాడట. సభానంతరం పొలం మీద పనికి వెళ్ళినప్పుడు నాగలక్ష్మి భోజనం తెచ్చింది. ఎప్పటిలాగే మర్రి చెట్టు క్రింద భోంచేసి కాస్సేపు పడుకుంటానంటే సరేనని బయలుదేరి ఒక వంద గజాలు వచ్చిందో లేదో, 'బాబోయ్! బాబోయ్!' అన్న కేకలు వినవచ్చాయి. ఆ కేకలు తన భర్తవేనని నాగలక్ష్మి ఉరుకుల మీద తిరిగి వచ్చింది.

. . ."పాము పాము" అని అరుస్తూ వీరయ్య అక్కడే స్పృహతప్పి పోయాడు. నోట్లో నుంచి నురగను. నాగలక్ష్మి సహాయంకోసం ఎన్ని కేకలు వేసినా మనుష్యులు దూరదూరంగా ఉండటంవల్ల ఆమె ఆక్రందనలు వాళ్ళకి వినపడలేదు. వాళ్ళు వచ్చేసరికి పది నిమిషాలైనా పట్టి ఉంటాయి.

వచ్చినవాళ్ళలో ఒకరు పూర్ణ్రకి పసుగెత్తి మంత్రగాడ్ని తీసుకొచ్చాడు. . . ఏం లాభం! అంతా అయిపోయింది. కాటు వేసిందేదో భయంకరమైన కాలసర్పం అయి ఉండాలి. మర్రి చెట్టు తొర్రలో అప్పుడప్పుడూ కనబడుతూ ఉండేదట. ఆ సంగతి ఖాతరు చెయ్యకుండా వీరయ్య అక్కడ పడుకోవడం విధికృతం!

మేము గంగాయపాలెం చేరుకునేసరికి నాలుగు దాటింది. జరగనున్న తతంగానికి వీలుగా వెంకటస్వామి ముందే ముగ్గురు జవాన్లని పంపించడంవల్ల పంచాయతీదార్లు సిద్ధంగా ఉన్నారు. గ్రామ మునసబు శ్రీకంఠయ్య, పెద్ద రైతు రామానాయుడు, కిరాణకొట్టు సిద్దయ్య, మరో ఇద్దరు పంచాయతీదార్లు. . .కొంచెం దూరంలో శవం ప్రక్కన తల వంచుకొని గుండె తరుక్కుపోయేలా ఏడుస్తున్న నాగలక్ష్మి. ఆ హృదయ విదారకమైన దృశ్యం చూస్తుంటే అక్కడ ఉండడానికి నాకు మనస్కరించలేదు. త్వరగా పని ముగించుకొని వెళ్ళిపోతే బాగుంటుందని పంచాయతీ ఆరంభించాం.

ప్రప్రథమంగా శవ పరీక్ష. చనిపోయిన వీరయ్య వయస్సు ముప్పై. శరీరం మీద ఏ విధమైన గాయాలు లేవు, కాని ఎడమ కాలి మడమ దగ్గర

పాము కాటు వేసిన గుర్తులు స్పష్టంగా కని పిస్తున్నాయి. విషం తలకెక్కి చనిపోయిన లక్షణాలు కూడా బాగా కనబడుతున్నాయి. ఇక మిగిలింది ప్రత్యక్ష సాక్ష్యం. భర్తని పోగొట్టుకుని విలపిస్తున్న నాగలక్ష్మిని ప్రశ్నించడం అంటే బాధకరమే అయినా తప్పదుగా.

"అమ్మా! నీ వెంత దుఃఖంలో ఉన్నా మా ధర్మం నిర్వర్తించాలి. నీ భర్తని పాము కరచిన పరిస్థితులు కొంచెం చెబుతావా?" అన్నాను.

నాగలక్ష్మి ఏడుస్తూనే జరిగిన సంగతులు (కారులో వెంకటస్వామి విశదీకరించినట్లు) చెప్పింది. కేకలు వినగానే పరుగెత్తుకు వచ్చిన వ్యక్తులు ఆమె సాక్ష్యాన్ని బలపరిచారు. వంచిన తల ఎత్తకుండా వ్రాసుకుంటున్న నేను ఒక్కసారి ప్రక్కకు చూశాను.

నాగలక్ష్మి వయసులో ఉంది. విరబోసుకున్న తల వెంట్రుకలు సర్దుకుంటుంటే ఆమె చెవులకు పెట్టుకున్న దుద్దులు కనబడ్డాయి. వాటిని పాము పడగల్లా మలిచారు. ఏ కంసాలి చేశాడో కానీ, ఆ ఆభరణం నాకు విశిష్టమైన కళాత్మక సృష్టిలా కనిపించింది.

ఒకప్రక్క పన్ను కనిపెడుతూ ఉన్నాడు కాబోలు వెంకటస్వామి. "సార్ ఈ కులస్థులందరూ నాగదేవతని పూజిస్తారు సార్! వివాహితులైన స్త్రీలు ఆ దేవత స్వరూపాన్ని దుద్దులుగా ధరిస్తారు" అని నాగలక్ష్మితో,—"అమ్మా! నువ్వు చెవులకుపెట్టుకున్న కమ్మలు ఒకసారి ఇస్తావా? దొరగారు చూస్తారు" అన్నాడు.

నాకు తీవ్రమైన కోపం వచ్చింది. "స్వామీ! నీకు బుద్ధి వక్రించిందా. . .అధిక ప్రసంగం. . ." ఇంకా ఏమేమో అనబోయాను. కాని నాగలక్ష్మి కంగారుగా చటుక్కున చెవికేసుకున్న ఒక కమ్మ తీసి వెంకటస్వామి చేతిలో పెట్టింది.


"ఇదిగో చూడండి, దొరగారూ!" అంటూ స్వామి తన ఆ నగని నా చేతికందించబోయాడు.

"ఛీ! ఛీ! నేను చూడనక్కరలేదు. . . అది తక్షణం ఆమెకిచ్చేయ్" అని నేను గట్టిగా కేకలు వేయడంతో వెంకటస్వామి వాడు ముఖంతో జారుకున్నాడు. అతడి అవకతవక చేష్టలతో నా ప్రాణం విసిగిపోయింది. నేను పంచాయతీదారులతో 'మీ అభిప్రాయం ఏమిటి?' అన్నాను.

రామానాయుడు లేచి, "అబ్బే! ఇందులో అనుమానాస్పదమైన సంగతులేమీ లేవండీ. పాముకాటువల్ల వీరయ్య మరణించాడని తెలుస్తూనే ఉంది. అలాగే తమరు వ్రాసుకోవచ్చు. పంచాయతీ దార్లమైన మా అందరికీ ఏకాభిప్రాయం అదే" అంటూ తక్కిన పంచాయతీదార్లవైపు చూశాడు. వాళ్ళందరు కూడా తలలూపారు.

"అయితే ఇంకేం! అలాగే చేద్దాం. . .వెంకట స్వామీ. . ."

వెంకటస్వామి హఠాత్తుగా అదృశ్యమయ్యాడు. ఎప్పుడు వెళ్ళాడో, కారు దగ్గర నుంచి కప్పు, సాసరూ తీసుకొస్తున్నాడు. నాకు ఒళ్ళు మండి పోయింది. ఈ మనిషిని ఏం చెయ్యాలో. . .




ఇంతమందిలో, అందులోనూ ఇలాంటి పరిస్థితిలో నే నొక్కణ్ణే అక్కడ కూర్చుని తాపీగా టీ ఎలా తాగుతాననుకున్నాడో!

వెంకటస్వామి వగర్చుకుంటూ వచ్చి కప్పు, సాసరూ అందిస్తూ, "దొరగారు ఎక్కడ ఉన్నా సాయంత్రం ఆరు గంటలకి టీ తీసుకునే అలవాటు. తీసుకోండి సార్" అన్నాడు.

వాటిని అతడి ముఖం మీదే విసిరి కొడదా మన్నంత కోపం వచ్చింది. కానీ సాటి పోలీసు మానవుణ్ణి పౌరుల ముందు కించపరచడం కూడా సభ్యత కాదు కదా. ఏం చెయ్యాలో తోచక ఆ కప్పు, సాసరూ అందుకుంటూ క్రింద పెడదామను కునే సమయంలో కప్పులో టీ ఒక చుక్కయినా కనపడలేదు. దానికిబదులు నాగలక్ష్మి దగ్గర నుంచి తీసుకున్న కమ్మ మాత్రం ఉంది.

కప్పు క్రింద చిన్న కాగితం. అందులో—"శవాన్ని ఆస్పత్రికి పంపించండి" అని అక్షరాలు కనబడ్డాయి?

ఒక క్షణం నేను చకితుణ్ణయిపోయాను. కొంపదీసి ఆ కప్పు క్రింద పెట్టాను కాదు. ఇంత తేటతెల్లంగా సాక్ష్యం ఉంటే శవాన్ని పోస్టుమార్టమ్ పరీక్షకి పంపించవలసిన అవసరం ఏమిటి? వెంకటస్వామి ఏదో పసిగట్టి ఉంటాడు అనుకుంటూ—"సాక్ష్యం ప్రకారం వీరయ్య పాము కాటువల్ల చనిపోయినట్లు బాగా తెలుస్తుంది. అలాగే పంచాయతీ రిపోర్టు వ్రాసి శవాన్ని వైద్య పరీక్షకోసం ఆస్పత్రికి పంపిద్దాం" అన్నాను.

రామానాయుడు కలవరంగా లేచి "పాము కాటు వల్ల మరణిస్తే శవపరీక్ష ఎందుకండీ. . .అనవరం. మాకెవరికీ ఏవిధమైన అనుమానం లేదని చెప్పాంగా? ఇప్పుడు మీరు శవాన్ని వైద్య పరీక్షకి పంపి—వీరయ్యకి రెండు రోజులదాకా అంత్యక్రియలు జరపడానికి వీలుపడదు. అతని భార్య తల్లిదండ్రులు అసలే విచారంలో ఉన్నారు" అన్నాడు.

వెంకటస్వామి మధ్యలో వచ్చి, "నాయుడుగారూ! మీకెందుకీ తాపత్రయం? కందకు లేని దురద బచ్చలికెందుకంట?" అన్నాడు. రామానాయుడికి కోపంతో ముఖం జేవురించింది. "ఏమయ్యా హెడ్డూ! మాటలు సరిగా రానీయ్. . .నీవెంత? నీ తాహ తెంత? పెద్ద మనుష్యులతో మాట్లాడటం నేర్చుకో. . ."

"నువ్వా పెద్ద మనిషివా? బుడి బుడి రాగాలు పెడుతున్న నాగలక్ష్మిని ప్రోత్సహించి విషప్రయోగం చేయించి పైగా నాటకమాడుతున్నావు. పెద్ద మనిషి!" అని మాయాబజారులో ఘటోత్కచుడిలా నవ్వసాగాడు. ఇంతలో నాగలక్ష్మి అరుస్తూ—"నేను వద్దు బాబూ అంటే నాయుడు విన్నాడు కాదు. పోలీసువాళ్ళు ఎలాగైనా పట్టేస్తారంటే వాళ్ల ముఖం! నేను వేసిన పథకాన్ని బ్రహ్మదేవుడు కూడా పసిగట్టలేడు' అన్నాడు. నాయుడు మాటలు నమ్మి ఇంత ఘోరం చేశాను. పాపిష్ఠురాల్ని నన్ను ఉరి తీయండి. ముక్కలు. ముక్కలుగా నరికి కాకులకి, గద్దలకి వెయ్యండి" అని పడిపోయింది.

తరువాత కథనం సూక్ష్మంగా చెప్పవచ్చు. రామానాయుణ్ణి, నాగలక్ష్మిని అరెస్టు చేయడం, వీరయ్య మృత దేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి పంపడం త్వరలోనే అయిపోయింది. పరిస్థితులు అకస్మాత్తుగా తారుమారైపోవడంతో గ్రామంలో చాలా సంచలనం కలిగింది. అధికార అవశిష్టాలు ముగించుకొని నేనూ, వెంకటస్వామి కారులో బయటపడే టప్పటికి రాత్రి ఎనిమిది దాటింది.

ప్రయాణం చేస్తున్నంతసేపూ వెంకటస్వామి ఈ రహస్యం ఎలా కనిపెట్టాడు అన్న సంశయం నా తలలో మెదలుతూనే ఉంది. అతడు చేసిన అవకతవక చేష్టలన్నిటిలో ఏదో అంతరార్థం ఉందన్నమాట.

"స్వామీ! నువు నిజం చక్కగా కనిపెట్టేశావు నేను కూడా మొదట్లో వీరయ్య మరణానికి పాము కాటే కారణమని భ్రమపడ్డాన సుమా!" అన్నాను.

వెంకటస్వామి వెనక్కు తిరిగి—"అంతా తమ చలవేనండీ. తమరే కనుక ఆ నాగలక్ష్మి కమ్మల వంక తదేక దృష్టితో చూడకపోతే నాకు అనుమానం వచ్చేది కాదు. నేను కొంచెం దగ్గరగా ఉన్నాను

కాబట్టి జాగ్రత్తగా పరీక్షించగలిగాను. అవి వేసుకున్న కమ్మలు సర్ప రూపంలో ఉన్నాయి. అది వాళ్ళ ఆచారం కాబట్టి అసాధారణ విషయం కాదు. కాని కమ్మకి రెండు ప్రక్కలా వేలాడుతున్న మాదుల్లాంటి కాడలు ఉన్నాయి. తమరు చూచే ఉంటారు. కాడలకి మధ్య ఒక పావు అంగుళం ఉంటుంది. . వీరయ్య కాలి మీద ఉన్న పాము కాటు గుర్తులు కూడా అదే సైజులో ఉన్నాయి."

"విషప్రయోగం కమ్మల ద్వారా జరిగిందనడానికి వీలు లేదుగా?"

"అదేనండీ. కాని, ఒక కమ్మని తీసుకుని కారు దగ్గర చూస్తే కాడల చివర్లలో కనీ కనబడకుండా చిన్న రక్తపు మరకల్లా కనబడ్డాయి. . . అందుచేత కాడతో కాలి మీద గాయం చేసి ఉండాలన్న అనుమానం కలిగింది. కమ్మని జాగ్రత్తగా పెట్టాను. రేపు తమ ఆజ్ఞ ప్రకారం లేబరేటరీకి పంపిద్దాం."

"అయితే మరి విష ప్రయోగం?"

"నాగలక్ష్మి పెద్ద నాటకం ఆడింది. విషం మధ్యాహ్నం భోజనంలోనే కలిపి భర్తని హత మార్చింది. అతడు నురగలు గ్రక్కుకుంటూ చావుబ్రతుకుల మధ్య ఉన్నప్పుడు చెవికి పెట్టుకున్న కమ్మతో గాట్లు వేసి తన భర్త సర్పదష్టుడై చనిపోయాడని అభూతకల్పన చేసింది. ఈ బ్రహ్మాండమైన పథకం వేసింది రామానాయుడు. ఆ పెద్ద మనిషికీ, నాగలక్ష్మికీ అక్రమ సంబంధం ఉంది!"

"ఓహో! అదా సంగతి! ఈ హత్యకి బలమైన కారణమేమిటా అని ఆలోచిస్తున్నాను."

"వీరయ్య మంచివాడే కాని కోపం వస్తే రక్తం కళ్ళ చూసే వ్యక్తి. ఈ సంగతి బయటపడితే పెద్ద రభసై పోతుందని గుట్టుచప్పుడు కాకుండా వీరయ్యని హతమారిస్తే ఏ ఇబ్బందీ ఉండదని రామానాయుడు, నాగలక్ష్మి కూడబలుక్కుని చేసిన ఘాతుకకృత్యం. చూడండి! ఆ రామానాయుడు పెద్ద మనిషినని మీసం మెలి వేసుకుని తిరుగుతున్నాడు. పెద్ద మనిషి! పండంటి సంసారంలో నిప్పులు పెట్టి ఘోరమైన హత్య చేయించాడు. నిజంగా ఉరి తీయవలసింది వాణ్ణి!"

ధనం, అధికారం, గౌరవం అనే అచ్ఛాదనల వెనుక పెద్దమనుషులమంటూ ఎందరో మహానుభావులు! అనటి విచిత్రం సంఘటన గురించి ఆలోచిస్తూ ఉంటే బడలికవల్ల కాబోలు కళ్ళు మూతలు పడుతున్నాయి. ఇంటికి చేరుకునే సమయానికి మెలకువ వచ్చింది. కారు తలుపు తీసి వెంకటస్వామి ఒక సెల్యూట్ కొట్టాడు.


అది భైరవ నాట్యంలో ఒక వికార భంగిమగా కనిపించినా నేను పట్టించుకోలేదు. ఏమాటకామాట ఆనాడు వెంకటస్వామి అద్వితీయమైన చాతుర్యం ప్రదర్శించాడు.

ఆ విషయం అతడికి చెప్పకుండా ఉండలేక పోయాను. ఆ అదను తీసుకుని స్వామి—"మంత్రి గారితో నిన్న ప్రొద్దున గంగాయపాలెం వెళ్ళినపుడు నేను రావటం కొంచెం ఆలస్యమైనందుకు దొరగారు చాలా కోప్పడ్డారు. నాది తప్పయిపోయింది. క్షమించండి" అని ప్రాధేయపడ్డాడు.

"అదేమిటోయ్! పని తొందరలో ఏదో అన్నానులే. ఏమీ అనుకోవద్దు. 'ఇవాళ నువ్వు చేసిన పరిశోధనకి బహుమానం ఇచ్చేలా రాస్తాను. సరేనా?"

"తమరెంత దయార్ద్ర హృదయులో నాకు తెలియదా! కాని నేను చేసిన ఆలస్యానికి కూడా కారణం లేకపోలేదు సార్! గంగాయపాలెంలో బందోబస్తు చేస్తున్నప్పుడు నా స్నేహితుడు సుబ్బారాయుడు కనపడ్డాడు. మాటల్లో రామానాయుడికీ, నాగలక్ష్మికీ సంబంధం ఉందని ఒక పుకారు పుట్టిందని, అది వీరయ్య చెవినపడితే ఏం అఘాయిత్యం జరుగుతుందో అని అన్నాడు. పది గంటలు తిరగలేదు. వీరయ్య మరణ వార్త వచ్చింది. అందుకే నాకు అనుమానం వచ్చి దొరగారు కూడా శవ పంచాయతీ వస్తే బాగుంటుందని అనుకున్నాను. తెరవెనుక భాగోతం తెలిస్తే నేను పరిశోధన బహూ తేలిక సుమండీ!"

మరొక "పోలీసు మహా సత్యం" నిరూపించి వెంకటస్వామి విశ్రమించాడు. ✱



ఆంధ్రప్రదేశ్‌లో పంపిణీదార్లు మెసర్స్. శ్రీ వెంకటేశ్వర ఏజెన్సీస్, నం. 1, శ్రీరామ బిల్డింగ్స్, హిందూపర్, 515201 జిలి. 548